# పౌరసరఫరాల శాఖలో వసూల్ రాజాలు!

ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన పౌర సరఫరాల శాఖలో అంతులేని అవినీతి రాజ్యమేలుతుంది. నెలకు ఐదు లక్షల రూపాయల మేర మామూళ్ల వసూలు చేసి గుమస్తా దగ్గర నుంచి జిల్లా మేనేజర్ వరకు వాటాలుగా పంచుకొంటున్నారు. బియ్యం సరఫరా చేసే మండల స్థాయి స్టాకు పాయింట్లలో నెలకు 20 నుంచి 30వేల రూపాయల వరకు పై సంపాదన వస్తుంది. జిల్లాలో మొత్తం 14 స్టాకు పాయింట్లు వున్నాయి. ఒక్కో స్టాకు పాయింట్లో ఒక డిప్యూటీ తహసిల్దార్, ఇద్దరు రూటు ఆఫీసర్లు విధులు నిర్వహిస్తుంటారు. వీరుగాక తహసిల్దార్లు, జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, విజిలెన్స్ ఎన్ ఫోర్స్‌మెంటు అధికారులు మండల స్థాయి స్టాకు పాయింట్లను తనిఖీలు చేయాల్సి వుంది.

**జిల్లాలో పౌరసరఫరాల శాఖ నేతృత్వంలో నడిచే 14 స్టాక్ పాయింట్ల నుంచి నెలసరి ఐదు లక్షల రూపాయలు మామూళ్లుగా వసూలు చేస్తారు. ఈ మొత్తంలో జిల్లా మేనేజర్‌కు లక్ష రూపాయలు, 14 మంది డిప్యూటీ తహసీల్దార్లు తలా పది వేలు, మిగిలిన మొత్తాన్ని క్రింది స్థాయి సిబ్బంది పంచుకొంటారు.**

మండల స్థాయి స్టాకు పాయింట్ల నుంచి చౌక దుకాణాలకు, హాస్టల్స్, మధ్యాహ్న భోజన పథకం, అన్నపూర్ణ, అంత్యోదయ తదితర పథకాలకు బియ్యం పంపిణీ చేస్తారు. స్టాకు పాయింట్ల నుంచి బియ్యం తీసుకెళ్లి చౌకదుకాణాలు, హాస్టల్స్‌లో దింపి వీటికి సంబంధించిన రశీదులను స్టాకు పాయింట్లలో అందజేయడం రూటు ఆఫీసర్ల బాధ్యత. స్టాకు పాయింట్ల నుంచి బియ్యం తూకం వేసే దగ్గర నుంచి రవాణా చేసి అన్‌లోడింగ్ చేసే వరకు చౌకదుకాణాల డీలర్లు అధికారులకు మామూళ్లు ముట్టచెప్పాలి. మామూళ్లు ముట్ట చెప్పకుంటే సకాలంలో బియ్యం రవాణా చేయక పోవడం, తూకం సరిగా వేయక పోవడం వంటి కిరికిరీలు స్టాకు పాయింట్ల సిబ్బంది చేస్తారు. దీంతో ఈ సిబ్బందితో ఎందుకొచ్చిన తంటా అని మామూళ్లు ఇస్తుంటారు. జిల్లాలోని 14 స్టాకు పాయింట్ల నుంచి నెలకు సుమారు ఐదు లక్షల రూపాయల వరకు మామూళ్ల రూపంలో అధికారులకు అందిన అవినీతి సొమ్మును అందరూ పంచుకుంటారు. ఇందులో పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌కు లక్షా, స్టాకు పాయింట్ డిప్యూటీ తహసిల్దార్లు ఒక్కొక్కరు పదివేలు, మిగతా మొత్తం క్రింది స్థాయి సిబ్బంది పంచుకుంటారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాల్సి వుంది. అయితే జాయింట్ కలెక్టర్ రామయ్య దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వున్నాయి. ఆయనకు కావలసిన మర్యాదలన్నీ ఈ శాఖాధికారులకే చేస్తున్నట్లు కలెక్టరేట్‌లో చెవులు కొరుక్కొంటున్నారు. తన వాటా తీసుకొంటున్నట్లు ప్రచారం జరుగుతుంది.

జిల్లా వ్యాప్తంగా ఇటీవల పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను ఏర్పాటు చేశారే తప్ప నిజంగా ధాన్యం కొనుగోలు చేయడానికి కాదని తెలుసుకోవచ్చు. పేద,



ఈ కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో బయట మార్కెట్లో రైతులు ధాన్యాన్ని విక్రయించుకుంటున్నారు. నామమాత్రంగానే కొనుగోలు మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై వుంది.



స్వర్గీయ శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి

## పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

**శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు**

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదికి
24 సంవత్సరములు నిండుతాయి.
ఈ సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

భార్య : **సోమిరెడ్డి హైమావతమ్మ**

కుమారుడు : **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
మాజీ మంత్రి

కుమార్తెలు : **కట్టంరెడ్డి సంయుక్త**
**కేతిరెడ్డి ఉష**

మనుమలు : **సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి**
**సోమిరెడ్డి అర్జున్**

మరియు **కుటుంబ సభ్యులు**

# అక్షయ త్రితీయ రోజు చేపట్టినదంతా బంగారమే!

శ్రీ పెజావర్ ఆరవ పీఠాధిపతి శ్రీ విజయానంద వర్ధంతి కూడా అక్షయ త్రితీయ రోజే వస్తుంది. ఆయన శ్రీమద్భగవద్గీత మీద చేసిన వ్యాఖ్యానం చాలా ప్రసిద్ధి చెందింది. పదిహేనో శతాబ్దానికి చెందిన విజ



యానంద సమాధి కన్వ తీర్థలో వుంది. అక్కడ ఆయన సమాధి పక్కన ఒక రావి చెట్టు వుంది. దానికింద కూర్చునే ఆయన భగవద్గీత మీద వ్యాఖ్యానం రాశాడని చెబుతారు. శ్రీకృష్ణమఠ్‌లో అక్షయ త్రితీయ రోజు అక్షయ పాత్రకు పూజలు చేస్తారు. ఆ అక్షయపాత్ర సూర్యభగవానుడు ఇచ్చిన పాత్ర అనీ, మహాసాధ్వి ద్రౌపది దానిలో వంటచేసి అతిథులకు వడ్డించేదని విశ్వసిస్తారు. ఆ పాత్రను తెరిచి పెట్టినప్పటి నుంచి కడిగి బోర్లించే లోపు ఎంత మందికైనా ఆహారాన్ని అపరిమితంగా అందిస్తుందని పురాణాలలో వుంది. అక్షయ పాత్రకు సంబంధించిన కథ ఒకటి వుంది. పాండవులు వనవాసానికి వెళ్లినప్పుడు ద్రౌపది అక్షయపాత్రలో అతిథులకు వండి పెట్టేది. కౌరవులు కుట్రతో దుర్వాస మహామునిని రెచ్చగొట్టి ద్రౌపది పాత్ర కడిగి బోర్లించిన తర్వాత భోజనం పెట్టమని అడగమని చెబుతారు. ఆ రుషి తమ మిత్రబృందంతో కలిసి నదిలో



స్నానం చేసి ద్రౌపది వద్దకు వెళ్లాలనుకుంటాడు. ఈ లోపు విషయాన్ని గ్రహించిన శ్రీకృష్ణుడు తనకు భోజనం వడ్డించమని అడుగుతాడు. ఏమి పెట్టాలో అర్థంకాక ఆందోళన పడుతుంది ద్రౌపది. అది గ్రహించిన కృష్ణుడు పాత్ర అడుగున ఒక మెతుకు వుంది దాన్ని వడ్డించు అని సలహా ఇస్తాడు. ఆ మెతుకును కృష్ణుడు తినగానే స్నానం చేస్తున్న దుర్వాస బృందం కడుపు నిండిపోతుంది. ఏమీ తినకుండానే కడుపు నిండిపోయే సరికి జరిగిందేమిటో గ్రహించి సిగ్గుపడిన దుర్వాస మహాముని ద్రౌపది దగ్గరకు రాకుండానే వెనక్కి మళ్లుతాడు. ఇదేవిధంగా అక్షయ త్రితీయ రోజు కొన్న ఏ వస్తువైనా, చేపట్టిన ఏ కార్యమైనా, ఎప్పటికీ క్షీణించకుండా, ఒట్టిపోకుండా సంపదను నిలుపుతుందని నమ్ముతారు. దీని మూలంగానే ఆ రోజు బంగారపు దుకాణాలు కిటకిటలాడిపోతాయి.

అక్షయ త్రితీయ రోజు ప్రారంభించి 20 రోజుల పాటు కొనసాగించే చందన యాత్రకు సంబంధించి కూడా ఒక పురాణ గాధ వుంది. సాక్షాత్తు జగన్నాథుడే రాజు ఇంద్రధ్యుమ్నుడిని ఈ ఉత్సవం జరపాల్సిందిగా ఆదేశించాడని చెబుతారు. వైశాఖంలో ఎండలు మండుతుంటాయి. చందనం పూసి దేవుని ఆహ్లాదపరచాలని ఇలా చేస్తారు. కళ్లు తప్ప మిగిలిన మొత్తం భాగానికి చందనం పూసి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. ఇన్ని ప్రత్యేకతలతో పాటు అక్షయ త్రితీయ రోజు తప్పనిసరిగా బంగారం కొనే ఆచారం కూడా హిందువుల్లో బాగా



పాదుకొనింది. నెల్లూరులో మత సామరస్యం ఫరిడవిల్లుతుంది. దీంతో ముస్లింలు, క్రైస్తవులు సైతం అక్షయ త్రితీయ రోజు బంగారం కొంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు.

## సిరిసంపదలు ఖాయం



భరత్ జైన్
గోల్డ్ ప్యాలెస్, నెల్లూరు.

అక్షయ త్రితీయ నాడు బంగారం కొనుగోలు చేస్తే సిరి సంపదలు కలుగుతాయని ప్రజల విశ్వాసం. దీంతో ప్రతి ఏడాది అక్షయ త్రితీయ నాడు బంగారం అమ్మకాలు పెరుగుతున్నాయి. త్రితీయ నాడు బంగారం కొంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. ప్రజలూ అక్షయ త్రితీయ రోజున బంగారం కొంటే కలిసి వస్తుందని నమ్ముతుండడంతో వ్యాపారం బాగా సాగుతుంది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం వ్యాపారం ఇంకా బాగా జరుగుతుందని ఆశిస్తున్నాను.

## ఒక్కసారి కొని చూడండి



అమరా మోహన్‌రావు
మోహన్ సిల్వర్ ప్యాలెస్, నెల్లూరు.

అక్షయ త్రితీయను పురస్కరించుకొని కస్టమర్లకు కొత్త కొత్త మోడల్స్‌లో ఆభరణాలను అందుబాటులో వుంచుతున్నాం. నాణ్యమైన బంగారంతో అధునాతన డిజైన్లను అందిస్తూ ఇప్పటికే సింహపురి మహిళాలోకం హృదయాలలో స్థానం సంపాదించాం. ధనలక్ష్మికి ప్రీతికరమైన అక్షయ త్రితీయ నాడు కొత్త బంగారు నగలను కొనుగోలు చేసినట్లయితే లక్ష్మీదేవిని ఇంటికి తీసుకెళ్లినట్లే. అక్షయ త్రితీయను తమిళనాడు, కర్నాటక, కేరళలో ఘనంగా జరుపుకొంటారు. గత రెండు సంవత్సరాల నుంచి నెల్లూరులో కూడా బాగా చేసుకొంటున్నారు. అంతటి పర్వదినం నాడు కస్టమర్లకు అందుబాటులో ఆభరణాలను వుంచేందుకు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మా షాపును తెరచి వుంచనున్నాం.

## స్పెషల్ డిస్కాంట్



అక్షయ త్రితీయను పురస్కరించుకొని లక్ష్మీ దేవి కాసులపై ఒక గ్రాముకు యాభై రూపాయల వరకు డిస్కాంట్ ఇస్తున్నాం. అదేవిధంగా గ్రాము బంగారం పైనా డెబ్బయ్ రూపాయల వరకు డిస్కాంట్‌ను అందిస్తున్నాం. ఎంతో ముఖ్యమైన అక్షయ త్రితీయ రోజున బంగారం కొనేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అక్షయ త్రితీయ నాడు అమ్మకాలు ఇంకా పెరుగుతాయని ఆశిస్తున్నాను.

– ధర్మేంద్రజైన్, సిల్వర్‌ప్యాలెస్, నెల్లూరు.

## లక్ష్మీపూజ చేశాక అమ్మకాలు



మహాలక్ష్మికి ఇష్టమైన రోజు అక్షయ త్రితీయ. ఆ రోజు బంగారు కొంటే మంచిదని పలువురి నమ్మకం. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ వారి వారి స్థాయిల్లో బంగారం కొనుగోలు చేసేందుకు గాను అన్నిరకాల ఆభరణాలను అన్ని స్థాయిల వారికి అందుబాటులో వుంచుతున్నాము. అక్షయ త్రితీయ నాడు మా షాపులో ప్రత్యేకంగా లక్ష్మీదేవి పూజచేసి అనంతరం ఆభరణాలను కస్టమర్లకు అందజేస్తాం. ఉదయం ఏడు నుంచి రాత్రి 12 గంటల వరకు షాపును తెరచి వుంచుతాం.

– మూల్‌చంద్, ఖజానా ప్యాలెస్, నెల్లూరు.

## అష్టైశ్వర్యాలు కలుగుతాయి



అక్షయ త్రితీయ నాడు బంగారం కొంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయి. అక్షయ త్రితీయ అనేది గత రెండేళ్లుగా మన రాష్ట్రంలోనూ ప్రాచుర్యంలోకి వచ్చింది. అక్షయ త్రితీయ రోజున బంగారం కొని ఇంటికి తీసుకెళ్తే బంగారంతో పాటు లక్ష్మీదేవి ఇంటికి వస్తుందనేది జనం నమ్మకం. అక్షయ త్రితీయ రోజు కొత్తగా కొన్న బంగారాన్ని లక్ష్మీదేవి పటం ముందు వుంచి పూజలు చేస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయి. నెల్లూరు నగరంలోని వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ముందుగానే బంగారం ఆర్డర్లు ఇచ్చి అక్షయ త్రితీయనాడు ఇంటికి తీసుకెళ్తారు.

– తె.నాగేశ్వరరావు, మహారాణి జ్యూయలర్స్, నెల్లూరు


## సిటీ కేబుల్ సూపర్ తంబోల

జమీన్‌రైతు

జమీన్‌రైతు,
సిటీ కేబుల్
(ఎసిఎన్‌టివి ఛానల్)

Siti Cable

సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు GEM ఛానల్‌లో సూపర్ తంబోల గేమ్ ప్రసారమౌతుంది!

**ఫుల్ హౌస్‌కు బహుమతి**

కలర్ టివి



**మూడు 'రో'లకు మూడు బహుమతులు**

'టాప్ రో' విజేతకు సెల్‌ఫోన్

'మిడిల్ రో' విజేతకు ఇన్‌స్టెంట్ వాటర్ హీటర్

'బాటమ్ రో' విజేతకు గిఫ్ట్ ఓచర్

ఈ గేమ్‌లో పాల్గొనడం చాలా సులభం. జమీన్‌రైతు వారపత్రికతో పాటుగా లభించే గేమ్ కూపన్ సేకరించండి. ప్రతి టిక్కెట్‌పైన సీరియల్ నంబరు, గేమ్ ఆడవలసిన తేది వుంటాయి. టివి ఛానల్‌లో యాంకర్ ప్రకటించే నంబర్లను మీ దగ్గరున్న టిక్కెట్‌లోని నంబర్లతో పోల్చుకోవాలి. ఆమె చెప్పిన నంబరు మీ టిక్కెట్‌లో వుంటే - పేనాతో గుర్తు పెట్టండి! ఇట్లా గుర్తు పెట్టిన నంబర్లు ఒక వరుసకు సరిపోతే - ఒక 'రో' పూర్తి అయినట్లు లెక్క; మొత్తం మూడు వరుసలలోని నంబర్లకు సరిపోతే, ఫుల్ హౌస్ గెల్చుకున్నట్లు లెక్క. 'రో' లేదా ఫుల్ హౌస్ పూర్తి కాగానే 2332399 నంబరుకు ఫోన్ చేసి, మీ టిక్కెట్ నంబరు చెప్పాలి. ఎవరు ముందుగా ఫోన్ చేస్తే వారికే బహుమతి. 'రో' లేదా ఫుల్ హౌస్ పూర్తికాక మునుపే ఫోన్ చేస్తే - కంప్యూటర్‌లో ఆ విషయం తెలిసిపోతుంది. తప్పుడు సమాచారం ఇచ్చిన టిక్కెట్లు బహుమతికి అనర్హమౌతాయి. అందువల్ల ఆ పొరపాటు చేయవద్దు. తతిమా వివరాలు టిక్కెట్ వెనుకవైపు వున్నాయి.

జమీన్‌రైతు వార పత్రికలో మాత్రమే టిక్కెట్లు లభిస్తాయి.

## ఢిల్లీ ముక్కుతాడు

మొదటి పేజీ కొరవ

న్నారు. ఆ ఉక్కపోత ప్రభుత్వం మీద కినుకుగా మారుతున్నది. రోజుకొకటిగా వెల్లువెత్తుతున్న భూ కుంభకోణాలు, వాటి పట్ల ముఖ్యమంత్రి ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రజలలో ఒక విధమైన విరక్తి కల్గిస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు అవకాశాలిచ్చినా చెడగొట్టుకోవడం తప్ప ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోదనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి ఈ పరిణామాలు. ఎన్నికలు రెండేళ్లలో పెట్టుకుని ప్రజలలో ఇటువంటి భావనలు ఏర్పరచుకోవడం ఆత్మహత్యా సాదృశ్యం. జరిగిన నష్టాన్ని ఎట్లా పూడ్చుకోవాలి అన్నదొక్కటే ఇప్పుడు పరిశీలించవలసిన విషయం. దానిపైనే దృష్టి పెడుతున్నాడిప్పుడు ముఖ్యమంత్రి. మంత్రివర్గ విస్తరణ, ఐఎఎస్ అధికారుల బదలీలు, అనుచరులపై అదుపు ఆయన పరిశీలనలో వున్న అంశాలు. ఈ మూడు కీలక అంశాలలో, ఎన్నికలను మనసులో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని ఆయనకు అందరూ సలహా ఇస్తున్నారు.

మంత్రివర్గ విస్తరణ ఇక ఎంత మాత్రం వాయిదా వేసే పరిస్థితి లేదు. వీలైతే ఈ నెలాఖరులోనే ఆ తంతు పూర్తి చేయాలని ఆలోచన. అది తప్పితే, అమెరికా పర్యటన నుంచి తిరిగి రాగానే, మే 15తేది లోపల గడువు పెట్టుకున్నట్లు వినికిడి. ప్రస్తుత మంత్రులలో అరడజను మంది వరకు ఉద్వాసన తప్పదని చెప్పున్నారు. మరీ అసమర్థులుగా పేరుపడిన వారు, తనకు అత్యంత ఆత్మీయులు అనుకున్న వారు ఈ తొలగింపు జాబితాలో వుంటారని చెప్పున్నారు. తన స్వంత మనుషులైతే, ఒకవేళ పదవి నుంచి తీసివేసినా గొడవ పెట్టకుండా సర్దుకొంటారని; రేపటి ఎన్నికల తర్వాత వారికి మంచి అవకాశాలివ్వవచ్చని ముఖ్యమంత్రి ఆలోచన అట. కొత్తగా తీసుకోబోయే వారిలో, జిల్లాలో రాజకీయ సామర్థ్యం ప్రధాన అర్హత కాబోతున్నది. రేపటి ఎన్నికలలో పార్టీని నడిపిస్తారు అన్న నమ్మకం కల్గిన వారిని మాత్రమే దగ్గరకు చేరదీయాలని భావిస్తున్నారు. 15 మంది వరకు కొత్త వారికి అవకాశం వస్తుందని అంచనా. నూతనంగా ఏర్పడిన శాసనమండలి నుంచి కూడా కనీసం ముగ్గురిని తీసుకొంటారని చెప్తున్నారు. మహమ్మద్ జానీ, కనుమూరి బాపిరాజు, పాలడుగు వెంకటరావు, భారతి రెడ్యానాయక్ పేర్లు విన్పిస్తున్నాయి. పొంగులేటి సుధాకరరెడ్డి కూడా క్యూలో వున్నాడు.

అయితే మంత్రివర్గ విస్తరణలో ముఖ్యమంత్రికి స్వేచ్ఛ లభిస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. మామూలుగా అయితే, తనకు నచ్చిన పేర్లు ఢిల్లీకి పంపి, ముద్ర వేయించుకోవడం ఆయనకు చిటికెలో పని. కానీ ఇప్పుడట్లా లేదు. ముఖ్యమంత్రి మీద సోనియా గాంధీలో విశ్వాసం సడలిందని చెప్తున్నారు. మొన్నటి శాసనమండలి అభ్యర్థుల ఎంపికలో ఆయన్ను ప్రక్కన పెట్టి, మొత్తం ఎంపిక తామే చేయడం దాని వల్లనే అని ఉదాహరణ చూపుతున్నారు. మంత్రిత్వాల విషయంలో కూడా అధిష్టానం ఈ పోకడ అనుసరిస్తే, ముఖ్యమంత్రికి ఊపిరాడని పరిస్థితి తప్పదు. తనకిష్టం లేని వారిని తన క్యాబినెట్‌లో పెట్టుకుని పరిపాలన చేయడం ఆయన వ్యక్తిత్వానికి సరిపడని విషయం. మరొక ప్రక్క భూ కుంభకోణాల గురించి, తన కుమారునికి కేటాయించిన భూముల గురించి కూడా సోనియాగాంధీ ఆరా తీస్తున్నారన్న వార్తలు ఆయనకు చీకాకు తెప్పిస్తున్నాయి. ఇటువంటి సమాచారాల వల్ల తమ మధ్య అగాధం ఏర్పడు తుందని ఆయన భయం. కానీ ఢిల్లీ పెద్దలు మాత్రం పూర్వం వలె ఆయన మాట పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. 42 మంది ఎమ్పీలను ఢిల్లీకి పంపించవలసిన కీలక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ మంట కలిసిపోతుండడం వారిని తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తున్నది. ఏదో ఒక చర్య తీసుకుని ఈ నష్టాన్ని నివారించుకోవాలన్న ఆలోచనకు వస్తున్నారు. అటువంటి ఆలోచనలు కాంగ్రెస్ రాజకీయాలలో ఎటువంటి పరిణామాలకు దారి తీస్తాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యమంత్రి అంత దూరం తెచ్చుకుంటాడా, ఇప్పటికైనా తన తప్పులు సరిదిద్దుకొంటాడా అన్నది వేచి చూడాలి.

## రాధయ్య

మొదటి పేజీ కొరవ

క్రమాలలో కూడా పాలు పంచుకునేవాడు. 1978లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ, పార్టీలో అవకాశాల కోసం ప్రయత్నం మొదలు పెట్టాడు రాధయ్య. కానీ పుల్ల విరిచి పొయ్యిలో పెట్టినట్లు, నిర్మొగమాటంగా మాట్లాడే అలవాటు వుండడంతో ఏ నాయకుడూ రాధయ్యను దగ్గరకు చేరనివ్వలేదు. అందరితో మనస్పర్థలే. అయినా పార్టీని వదలలేదు; తన ప్రయత్నాలూ మానలేదు. అసెంబ్లీ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కోవూరు స్థానానికి టిక్కెట్ అడగడం, ఆశాభంగం పొందడం ఒక అలవాటుగా మారింది. ఇన్నేళ్ల పోరాటం తర్వాత ఇప్పుడు అవకాశం లభించింది రాధయ్యకు.

అదే విచిత్రమైన విషయం. జిల్లా నుంచి ఒక్క కాంగ్రెస్‌వాది కూడా రాధయ్యకు మాట సాయం చేయలేదు. పైపెచ్చు ఒకరిమీద మరొకరు పోటీలు పడి మరీ రాధయ్యకు ఇవ్వడానికి లేదని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి వద్దకు చాలా రాయబారాలే నడిచాయి, వద్దు అని చెప్పడానికి. ఎమ్మెల్యేల నియోజకవర్గం అభ్యర్థుల ఎంపికలో ఆ ప్రతిఘటన ఫలించింది. ముఖ్యమంత్రి సిఫార్సు చేసినా, ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి గట్టిగా మాట చెప్పినా, జాబితాలో పేరు రాలేదు. ఆ తిరస్కారంతో రాధయ్య పని ముగిసిపోయిందనే అనుకున్నారు అందరూ. కానీ ముఖ్యమంత్రి పట్టుబట్టి, గవర్నర్ నామినేషన్ కోటాలో పేరు చేర్పించడంతో, ముప్పయ్యేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫలితం చేతికి అందింది. మాట పెళుసు అన్న ఒకే ఒక్క అభ్యంతరం తప్ప, శాసనమండలి సభ్యత్వానికి రాధయ్య అన్ని విధాలా అర్హుడు. ఎన్ని తిరస్కారాలు, అవమానాలు, ఆశాభంగాలు ఎదురైనా; పార్టీలో తనకు చీపురు పుల్ల విలువ ఇవ్వకుండా ఏళ్లతరబడి వెనక్కు నెట్టినా, ఏ రోజూ పార్టీ వదిలే ఆలోచన చేయని నిఖార్సైన కాంగ్రెస్‌వాది కావడం కంటే, పదవికి వేరే అర్హతలు ఎందుకు?

అయితే రాధయ్య పదవీ అందలం ప్రభావం జిల్లా కాంగ్రెస్‌లో విశేషంగానే వుండి తీరుతుందన్నది ఒప్పుకోవలసిన నిజం. అది ఎట్లా వుంటుంది అన్నది వేచి చూద్దాం. పట్టువదలని విక్రమార్కుడి వలె జీవితకాలం ప్రయత్నం చేసి, సరైన గుర్తింపు సాధించిన రాధయ్యను మనసారా అభినందిస్తున్నాము.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ల్సీగా గవర్నర్ కోటాలో జూపూడి ప్రభాకర్‌రావును ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో వున్న రెండు కోట్ల మంది మాల, మాదిగలు ఐక్యపోరాటాలు చేయాలని, ఈ వుద్యమానికి మందా కృష్ణమాదిగ నాయకత్వం వహించినా తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలను కలుపుకొని రాజ్యాధికార సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పలువురు మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్ కిడ్స్ కాన్వొకేషన్

నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో కిడ్స్ కాన్వొకేషన్ ఘనంగా జరిగింది. షుగర్ డాక్టర్ పి.మీనాక్షి సుందరి, పి.ఆంటోని రెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ సి.నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## లక్ష్మయ్య యాదవ్‌కు పదవి

కాంగ్రెస్ పార్టీలో పదవితో నిమిత్తం లేకుండా చాలా రోజులుగా గట్టి కార్యకర్తగా పనిచేస్తున్న బిసి నాయకుడు దాచూరు లక్ష్మయ్య యాదవ్ పార్టీ రాష్ట్ర ఓబిసి సెల్ వైస్ ఛేర్మన్‌గా నియమితులయ్యారు. ఇప్పటికైనా లక్ష్మయ్యను పిసిసి గుర్తించడం శుభపరిణామం.

## చైనా వాస్తు

8వ పేజీ కొరవ

లపై నమ్మకం వుండేవారు మార్కెట్‌లో దొరికే రకరకాల చైనా వాస్తు వస్తువులు, చెట్లను కొనుగోలు చేసి తమ ఇళ్లలో అలంకరించుకొంటున్నారు. లక్కీ ట్రీ చిన్నవి యాభై రూపాయలు ధర పలుకుతుండగా పెద్ద చెట్లు వంద రూపాయల వరకు అమ్ముతున్నారు. నవ్వే బుద్ధుడు, తదితర వస్తువులు వంద రూపాయల నుంచి రెండు వందల రూపాయలకు దొరుకుతూ చైనా వాస్తును తాము పాటిద్దామన్న ఆసక్తిని పలువురిలో రేపుతున్నాయి.

## రామ్‌ప్యారీ

9వ పేజీ కొరవ

టులోకి వచ్చాయి. రత్నా కిల్లీ, బాబుల్ కిల్లీ, బాబా, 120 కిల్లీ, 420, 620 పేర్లతో రకరకాల రుచులతో కూడిన కిల్లీలను 786 పాన్‌షాపులో వేసిస్తారు. నగరంలో మరెక్కడా దొరకని విధంగా ఒరిజినల్ వస్తువులతో కిల్లీలను వేస్తున్నారు. రెండు రూపాయల నుంచి ఇరవై రూపాయల వరకు కిల్లీలు ఈ పాన్‌సెంటర్‌లో లభిస్తాయి. నగరంలోని దూర ప్రాంతాల నుంచి సైతం కస్టమర్లు కిల్లీ వేసుకొనేందుకు పెద్దబజారులోని 786 పాన్‌షాపుకు వస్తున్నారంటే ఈ షాపుకున్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు.

## బాలప్రతిభ

8వ పేజీ కొరవ

పాల్గొన్న ఈ పోటీల్లో శ్రీహిత ఆంధ్ర రాష్ట్రం నుంచి పాల్గొని జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడం శ్రీహిత ప్రతిభా పాటవాలకు నిదర్శనం. శ్రీహిత చదువుతో పాటు ఆటపాటల్లోనూ పాల్గొంటూ అన్ని రంగాల్లోనూ తన తెలివితేటలను ప్రదర్శిస్తోంది. లెక్కలకే పరిమితం కాకుండా కూచిపూడి డ్యాన్సులోనూ శిక్షణ పొందుతూ మంచి నాట్యకారిణిగా అయ్యేందుకు మెరుగులు దిద్దుకొంటోంది. శ్రీహిత తల్లి అనూరాధ గృహిణి, తండ్రి ఇస్కా భక్తవత్సలరెడ్డి అల్లూరు తహసిల్దార్‌గా పనిచేస్తున్నారు. స్పీడ్ మ్యాథ్సులో తనకు తోడ్పాటునందిస్తూ, తీర్చిదిద్దుతున్న వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ జ్యోతిప్రతాప్‌కు శ్రీహిత కృతజ్ఞతలు చెప్పింది. భవిష్యత్‌లో ఐఐటిలో ఇంజనీరింగ్ చేసి దేశం గర్వించదగ్గ ఇంజనీర్‌గా పేరు, ప్రతిష్ఠలు తెచ్చుకోవాలన్న ఆకాంక్షను శ్రీహిత వ్యక్తం చేసింది.

## అంతులేని అవినీతి

11వ పేజీ కొరవ

చేపట్టాల్సి వుంది. ఇటువంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతున్నా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు మాత్రం ఆయా గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇదిలా వుండగా ఈ శాఖ చేపట్టే కార్యక్రమాలు అమలు చేయక అధికారుల పనితీరును పర్యవేక్షించే డిప్యూటీ డైరెక్టర్‌కు ఒక్కో సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి ప్రతినెలా ఐదువేల రూపాయల ముడుపులు సమర్పించుకొంటున్నారు. గత సంవత్సరం సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం ఆధునీకరణ పేరుతో లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయి. కంప్యూటర్ రూమ్, ఫర్నిచర్ కొనుగోలు తదితర మరమ్మత్తులు చేయడానికి ఇదే కార్యాలయంలో పని చేసే ఓ సీనియర్ అసిస్టెంటు కాంట్రాక్టు తీసుకున్నారు. ఆధునీకరణ, మరమ్మత్తు పనులు ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపట్టాలి. దీనికి భిన్నంగా ఈ కార్యాలయం సీనియర్, అసిస్టెంట్‌కు ఆధునీకరణ, మరమ్మత్తు పనులు చేసి కాంట్రాక్టును అప్పగించడంపై లక్షల రూపాయలు చేతులు మారాయి.

గతంలో ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం ఐటిడిఏ పివోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామచంద్ర హయాంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం ఆధునీకరణ పనుల పేరుతో ఖర్చు చేసిన నిధులపై సమగ్ర విచారణ జరిపితే అక్రమాలన్నీ బహిర్గతమవుతాయి. జిల్లా కలెక్టర్ కేవలం హాస్టళ్ల పైనే కాకుండా ఈ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల పట్ల కూడా దృష్టి సారించి ఈ శాఖను సంస్కరించాల్సి వుంది.




వసుపులేటి విజయకుమార్
మాధవయ్య అండ్ సన్స్

**10వ వర్ధంతి సంస్మరణ**

ఎన్నేళ్లు గడిచినా
ఎద ఏడిపోని
నీ జ్ఞాపకాలు మనస్సును
గిలి పెడుతూనే వున్నాయి!
నిన్ను మరచి పోవడం
నా తరం కాదు మిత్రమా!

ఆడిటర్ టి.వి.వసంతకుమార్‌రెడ్డి



**సంతాపం**

**కుల్లూరు గ్రామస్తుడు**
**డా॥ రేచర్ల చెంచుకేశవులు గారు**

జయభారత్ హాస్పిటల్‌లో 30.3.2007తేది ఉదయం మరణించారు. ఆయన వయస్సు 84 సం॥ ఆయన వ్యవసాయ కుటుంబంలో జన్మించి బడుగు మరియు మధ్యతరగతి వారికి విద్యా సేవార్థమై పాఠశాల నిర్మాణం కొరకు విరాళము సేకరించుటలోనూ మరియు వైద్య సేవలోనూ పాటు పడ్డారు. ఆయన మరణం పట్ల శ్రీ ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మరియు అడ్వకేట్, CITU నాయకులు P.మురళీధరరావు, రామచంద్రామిషన్ సభ్యులు ఆర్.మాలకొండయ్య ప్రముఖులు సంతాపం తెలిపారు.

# సణుగుడు

## * వాస్తు ప్రభావం వల్లనేనా నెల్లూరులో ఆడపెత్తనం అంతగా పెరుగుతున్నది?

శాస్త్ర సంబంధమైన సెంటిమెంట్లన్నిటిలోకీ వాస్తు బలీయమైనది. ఒకసారి ఆ గిలి మనసులో పడిందంటే, ఆ తర్వాత జీవితమంతా దిగులు మయమే. ఎన్ని సవరణలు చేసినా, ఇల్లు కూలగొట్టి మళ్లీ కట్టినా ఎక్కడో ఒకమూల వాస్తు దోషం, లోపం కన్పిస్తూనే వుంటుంది. రాత్రి నిద్ర పట్టకుండా చేస్తుంది. యాదృచ్ఛికంగా జరిగే పరిణామాలను వాస్తు లోపాలకు అన్వయించుకుని మథనపడే వారు కోకొల్లలు. వాస్తు శాస్త్రం ఇళ్లకు మాత్రం పరిమితం కాదు. గుడులు, బడులు, చివరకు ఊళ్లకు కూడా వర్తిస్తుంది. వాస్తు సక్రమంగా అమరిన ఊరిలో జనం సుభిక్షంగా వుంటారని వాస్తు శాస్త్రవేత్తల భరోసా. అదే సమయంలో వాస్తు దోషం వుంటే, దాని ఫలితం మొత్తం ఊరిలోని జనాభా మీద ఏదో ఒకరకంగా పడితీరుతుందనీ వారు హెచ్చరిస్తూ వుంటారు. ఒక్క నిముషం వాస్తు పండితులు చెప్పేది విని, మన నెల్లూరులో ఏమి జరుగుతున్నదో చూస్తే, వాస్తులో కూడా ఎంతో కొంత నిజం వుండేమోనన్పిస్తున్నది. అది యాదృచ్ఛికం కావచ్చు, లేక నిజంగా వాస్తు మహిమే కావచ్చు, నెల్లూరులో నడుస్తున్న రాజకీయ పరిణామాలు మాత్రం ఆసక్తి కల్గిస్తున్నాయి.

వాస్తు శాస్త్రం ప్రకారం దక్షిణ ఆగ్నేయం పెరిగిన ఇంట్లో స్త్రీ ప్రాబల్యం ఎక్కువౌతుందట. దాదాపుగా వాస్తు గ్రంథాలన్నీ ఆగ్నేయం పెరుగుదల అరిష్టమని చెప్తున్నాయి. 'మానసారం' అనే ప్రాచీన వాస్తు గ్రంథంలో ఆగ్నేయం పెరుగుదల గురించి ఇట్లా వర్ణించారు –

శ్లో ॥ "ఆగ్నేయం సర్వదోషకరం భవేత్
ఆగ్నేయ ప్రాచికం తస్మాత్సర్వం
విసర్జయేత్"

మరొక గ్రంథంలో ఆగ్నేయం పెరుగుదల వల్ల "దేహో, రోగో, విత్త నాశో, బంధుహానిర్భవిష్యతీ" అని పేర్కొన్నారు. అంటే ఆగ్నేయం పెరుగుదల వల్ల గ్రహబాధలు, రోగాలు, బంధుహాని, ధన నాశనం వంటి అరిష్టాలు కలుగుతాయని అర్థం. స్థూలంగా అందరు శాస్త్రవేత్తలు చెప్పే వాటిని పరిశీలిస్తే, ఆగ్నేయం పెరుగుదలకు, అతివల పెత్తనానికి సంబంధం వుందన్పిస్తుంది. దక్షిణ ఆగ్నేయం పెరిగితే స్త్రీలు పెత్తనం వహిస్తారని, పురుషుల మీద ఆధిపత్యం ప్రదర్శించడం, స్వతంత్రంగా వ్యవహరించడం వంటివి జరుగుతాయని; అదే తూర్పు ఆగ్నేయం పెరిగితే పురుషులు భ్రష్టులై స్త్రీల తిరుగుబాట్లు ఎదుర్కొంటారని; గౌరవ హాని జరుగుతుందని గ్రంథాలు చెప్తున్నాయి.

నెల్లూరు నగరంకు కలెక్టర్ ఆఫీసును కేంద్రంగా పరిగణించడం సాంప్రదాయం. అక్కడ నుంచి చూస్తే, గత పది పదిహేనేళ్లుగా నెల్లూరు పెరుగుదల మొత్తం తూర్పు, దక్షిణ ఆగ్నేయాల వైపే వున్న విషయం స్పష్టమౌతుంది. స్టోన్‌హౌస్‌పేట, బాలాజీ నగర్ వంటివి నెల్లూరుకు తూర్పు భాగాలు. పెన్నా వారధి, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు విస్తరణ ఈశాన్య భాగం అవుతుంది. హరనాథపురం తూర్పు ఆగ్నేయం అయితే, మాగుంట లేఔట్ దక్షిణ ఆగ్నేయం. గత పది పదిహేనేళ్లుగా కొత్త ఇళ్లు, విస్తరణ ఈ ప్రాంతంలోనే అధికం అన్న సంగతి అందరికీ తెలుసు. పెన్నా నది అడ్డం వల్ల నెల్లూరు వాయువ్యంగా పెరిగే

### డోలేంద్ర

అవకాశం లేదు. పడమర విస్తరణకు నెల్లూరు చెరువు అడ్డంకి. నైరుతిలో బాగా పెరగవచ్చు. కొంతకాలం పొదలకూరు రోడ్డులో ఆ ఛాయలు కన్పించాయి. మాగుంట లేఔట్‌తో పోలిస్తే పొదలకూరు రోడ్డులో ఇళ్లు కట్టుకోవడం సులభం. పునాదుల ఖర్చు తక్కువ. పెద్దగా నీటి సమస్య వుండదు. కానీ సంపన్నులంతా ఆ ప్రాంతం వది లేసి, ఏ వసతీ లేని ఈ ప్రాంతాన్ని ఎన్నుకొంటున్నారు. కొండాయపాళెం గ్రామం దాటి వెళ్లి పోతున్నారు. అటు హరనాథపురం వైపు కూడా ముత్తుకూరు రోడ్డు ప్రక్కన పెరుగుదల వేగంగా నడుస్తున్నది. అంటే నెల్లూరు తూర్పు, దక్షిణ ఆగ్నేయాలుగా విస్తరిస్తున్నదన్న మాట.




నెల్లూరు టౌన్‌హాల్‌లో వైకామేశ్వరరావు మెమోరియల్ నాటక కళా పరిషత్ పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న సినీ నటుడు సాయికుమార్. వేదికపై సుధాకరరాజు, కృష్ణమూర్తి, శ్రీనివాసమూర్తి, ప్రసాద్‌రెడ్డి.

నెల్లూరు రాజకీయాలలో ఇటీవల కొంతకాలంగా ఆడ పెత్తనం మాత్రమే నడుస్తున్న తీరు చూస్తే, వాస్తులో ఎంతో కొంత నిజం లేక పోలేదన్పిస్తుంది. పులులు, సింహాలు, ఏనుగుల వంటి నాయకులు తాము ప్రక్కకు తప్పుకుని, తమకు దగ్గరైన మహిళలకు అవకాశాలివ్వడం జరిగిపోతున్నది. నెల్లూరు నుంచి కేంద్రంలో మంత్రిత్వం నెరపుతున్నది పనబాక లక్ష్మి. రాష్ట్రమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ. నెల్లూరు మేయర్ పులిమి శైలజ. నెల్లూరులో ఎమ్మెల్యే పురుషుడైనా పెత్తనం మహిళదన్న సంగతి తెలిసిన విషయమే. కావలి ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఇప్పుడు తమ కుటుంబ రాజకీయ వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారు. బిజెపి జాతీయ నేత వెంకయ్య నాయుడు తన కుమార్తె దీపా వెంకట్‌కు తన సేవా కార్యక్రమాల పెత్తనం అప్పచెప్పారు. ఒక్కసారిగా జిల్లా నుంచి ఎంతమంది మహిళలు పెత్తనానికి వచ్చారో గమనించండి. రిజర్వేషన్ల వల్ల వచ్చి వుంటే ఈ పరిణామాన్ని పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు. కానీ ఇప్పుడు జిల్లా నుంచి ఆధిపత్య స్థానంలో వున్న మహిళలు రిజర్వేషన్ల ద్వారా వెలుగులోకి వచ్చిన వారు కారు. తమంతట తాముగా, తమ తమ కుటుంబాలలో మగవారిని ప్రక్కన పెట్టి, పైకి ఎదిగిన వారు. గత యాభై అరవై ఏళ్ల చరిత్రలో ఎప్పుడూ ఒకేసారి ఇంత మంది మహిళలకు అధికార యోగం పట్టిన దాఖలా లేదు. చెదురుమదురుగా అక్కడొకరు, ఇక్కడొకరు అన్నట్లుగా వెలుగులోకి రావడం తప్ప, జిల్లా మొత్తాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునే అవకాశం మహిళలకు లభించడం ఇదే ప్రథమం.

ఈ పరిణామం వాస్తు ప్రభావం వల్ల అనుకోవడంలో నాకేమీ తప్పు కన్పించడం లేదు. అదే సమయంలో దీన్ని వాస్తు దోషం అనడం లేదు నేను. వాస్తు వల్ల జరుగుతున్న మంచిగానే భావిస్తాము. జనాభాలో సగంగా వున్న వారికి ఎప్పుడో ఒకసారి అయినా అవకాశం ఇవ్వడంలో తప్పేమీ లేదు కదా? జిల్లా నుంచి కేంద్రంలో కానీ, రాష్ట్రంలో కానీ మంత్రి పదవులు ఆశించి భంగపడుతున్న నేతలందరూ, ఈ వాస్తును సరి చేసుకుంటే మంచిదేమో ఆలోచించండి.






Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.